క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండులో పోలీసుల తనిఖీ



ఆర్టీసీ బస్టాండులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో సోమవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి కడపకు చేరుకున్న వారిని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతున్న వారిలో అనుమానాస్పదంగా కనిపించిన వారి గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. ఏ పనిపై వెళుతున్నారని ఆరా తీశారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు ప్రయాణీకులకు సూచించారు.

పాత కడప దళితులకు న్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పాత కడప దళితులకు న్యాయం చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో దళితుల భూమి సమస్యను జేసీ అదితిసింగ్‌కు ఆర్‌సీపీ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత రెవిన్యూ అధికారులు పాత కడప దళితుల భూమి విషయంలో ప్రత్యేక చొరవ చూపి వారికి న్యాయం చేయాలని కోరారు.

వైవీయూ వీసీకి అభినందన



వైవీయూ వీసీ బెల్లకొండ రాజశేఖర్‌కు పూల గుచ్ఛం అందజేస్తున్న ఏఎఫ్‌యూ వీసీ

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయ వీసీగా బాధ్యతలు చేపట్టిన బెల్లకొండ రాజశేఖర్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బొమ్మిరెడ్డి జయరామిరెడ్డి సోమవారం వైవీయూలో మర్యాద పూర్వకంగా కలిసి పూల గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వైవీయూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

జీవన ఎరువులు వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఊటుకూరు డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ క్రిష్ణప్రియ

కడప అగ్రికల్చర్: రైతులు జీవన ఎరువులు వాడాలని ఊటుకూరు డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ క్రిష్ణప్రియ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని తాడిగొట్ల గ్రామంలో సోమవారం రైతులలో జీవ ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. రూరల్ అప్రైజల్(పిఆర్‌ఏ) కార్యక్రమంలో భాగంగా తిరుపతి, ఉదయగిరి ఎస్‌జీఎంఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొని రైతులతో సంభాషించి వారి వనరులు, వ్యవసాయ పరిస్థితులు, సమస్యలు, అవసరాలను విశ్లేషించారు. రైతులు చురుగ్గా పాల్గొని చర్చా కార్యక్రమం ద్వారా తమ వ్యవసాయ సాగులో అనుమానాలను నివృత్తి చేసుకున్నారు.

ఫొటోగ్రఫీ శిక్షణతో మెరుగైన జీవనం

కడప ఎడ్యుకేషన్: ఫొటోగ్రఫీలో శిక్షణ తీసుకోవడం ద్వారా మెరుగైన జీవనాన్ని పొందవచ్చని పదవీ విరమణ బ్యాంకు మేనేజర్ గౌతమ్ పేర్కొన్నారు. కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ కోర్స్ ఇన్ మొబైల్ ఫొటోగ్రఫీ కార్యక్రమంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ శిక్షణలో నైపుణ్యం నేర్చుకుంటే అద్భుతమైన ఫొటోలు తీయవచ్చని అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా నిలదొక్కుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి సలీం బాషా మాట్లాడుతూ ఫొటోగ్రఫీ సర్టిఫికెట్ ప్రోగ్రాం విద్యార్థులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన ఈ కోర్సు ప్రారంభ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురివిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

కడప అర్బన్: అలంఖాన్ పల్లె సచివాలయానికి సీపీఐ నాయకులు వెంకట శివ, నాగరాజుతో పాటు మరో ఐదుగురు తాళం వేశారు. సచివాలయానికి వచ్చే ప్రజల కు సరిగా పనులు చేయకపోవడం కారణమని సీపీఐ నాయకులు ఆరోపించారు. దీంతో సచివాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో వెంకట శివ, నాగరాజు, మరో ఐదుగురు మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలుపోతున్నాయ్

- చంద్రబాబు, లోకేష్ లాభాల కోసమే మద్యం వ్యాపారం
- కల్తీ మద్యంపై సీబీఐతో విచారణ జరిపించాలి
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయర్ కె. సురేష్ బాబు డిమాండ్
- కడపలో భారీ ర్యాలీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం



కల్తీ మద్యాన్ని అరికట్టాలని ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: నారా వారి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, కల్తీ మద్యాన్ని సరఫరా చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం జనం ప్రాణాలతో చెలగాటమాడుతోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, అన్నమయ్య జిల్లా పరిశీలకులు, మాజీ మేయర్ కె. సురేష్ బాబు ధ్వజమెత్తారు. సోమవారం ప్రకాష్‌నగర్‌లోని అల్లం టీ సెంటర్ నుంచి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయం ఎదుట కల్తీ మద్యాన్ని కింద పారబోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ లాభాల కోసమే నకిలీ మద్యం వ్యాపారం చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు తయారు చేసిన నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. మహిళల తాళిబొట్లు తెంచడానికే ఈ నకిలీ మద్యాన్ని తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. నకిలీ మద్యం స్కాంలో అడ్డంగా దొరికిపోవడంతో చంద్రబాబు నోరు మెదపడం లేదన్నారు. ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ పత్తా లేకుండా పోయారన్నారు. జనసేన అధినేతగా ప్రజలకు సేవ చేస్తానన్న పవన్ కళ్యాణ్, నిజంగా ప్రజల జీవితాలు బలైపోతున్న ఈ తరుణంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సేవ అంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులభం కాదన్నారు. కల్తీ మద్యం వెనుక ఉన్న రాజకీయ మాఫియాను బయటపెట్టేంత వరకూ తమ పోరాటం ఆగదన్నారు. కల్తీ మద్యం అనేది ఇది సామాన్య నేరం కాదు, ఇది ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న జనహత్య అన్నారు. దీని వెనుక ఉన్న రాజకీయ మాఫియాను బయటపెట్టి శిక్షింపజేస్తామని హెచ్చరించారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని, ఇప్పటికే జరిగిన కల్తీ మద్యం మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, రీ పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఎస్ఈసీ సభ్యులు యానాదయ్య, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు బండి దీప్తి, జోనల్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు కె. బాబు, షఫీ, రామలక్ష్మణ్‌రెడ్డి, షంషీర్, పార్టీ నాయకులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్ వినోద్, జమాల్‌వలీ, గౌస్, బి. మరియలు, చైతన్య, సుశీలమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న మహిళలు



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కల్తీ మద్యాన్ని కింద పారబోస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయర్ కె. సురేష్ బాబు, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం తదితరులు



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి



ఫిర్యాదును స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు సోమవారం × ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లాడి వారి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్. సుధాకర్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కడప ఎడ్యుకేషన్: చదువు వెంటే శిక్షణ తీసుకుంటే భవిష్యత్తులో జీవనోపాధికి ఎలాంటి ఢోకా ఉండదని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రిన్సిపాల్ సలీంబాష పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ బాటని ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సులో భాగంగా పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయస్టర్ పుట్టగొడుగుల పెంపకంతో పాటు పాల పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు.

కడప నుంచి లక్ష సంతకాల సేకరణ

– మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

– నేటి నుంచి అన్ని డివిజన్లలో చేపట్టనున్నట్లు వెల్లడి

కడప కార్పొరేషన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కడప అసెంబ్లీ నియోజకవర్గం నుంచి లక్ష సంతకాలను సేకరించనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష తెలిపారు. సోమవారం సాయంత్రం 35వ డివిజన్‌లోని నకాష్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 10 మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి కోటి సంతకాలు సేకరించాలని పార్టీ పిలుపునిచ్చిందని, ఈ మేరకు నకాష్‌లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు ఎలాంటి నష్టాలు, ఇబ్బందులు వస్తాయి...ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు నడిపితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయనే విషయాలపై ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. కడపలో 50 డివిజన్లు ఉండగా ప్రతి డివిజన్ నుంచి 2000 సంతకాలు సేకరించాలని నిర్ణయించామన్నారు. మంగళవారం నుంచి అన్ని డివిజన్లలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, డివిజన్ ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు గడప గడపకు వెళ్లి ఈ సంతకాల సేకరణ చేయాలన్నారు. మెడికల్ కాలేజీల ప్రవేటీకరణను రద్దు చేసేవరకూ ఈ పోరాటం సాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి ,35వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఏ షంషీర్, పార్టీ నాయకులు దాసరి శివప్రసాద్, బీహెచ్ ఇలియాస్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



నకాష్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మూడు నెలలుగా దస్తగిరి పేట వాసుల వీధుల్లోకి ఇళ్లల్లోకి మురుగునీరు చేరి దోమలకు నిలయంగా, విష జ్వరాలకు ఆవాసంగా దస్తగిరి పేట నిలిచిందని వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ పేర్కొన్నారు. సోమవారం దస్తగిరి పేట వాసులు సంబంధిత ఆలం ఖాన్ పల్లె లోని 49 వ డివిజన్ సచివాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికక్కడ స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో నగర పాలక అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. నెలల తరబడి డ్రైనేజ్ సమస్య తో దస్తగిరి పేట వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పట్టించుకునే పరిస్థితి పాలక యంత్రాంగంలో లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇళ్లల్లో ,వీధుల్లో డ్రైనేజీ సమస్యపై జనం సంబంధిత సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ మేమేమీ చేయలేమంటూ పట్టించుకున్న పరిస్థితి లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే దస్తగిరి పేట డ్రైనేజీ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఆలంఖాన్ పల్లె శాఖ కార్యదర్శి నాగరాజు, 49 వ డివిజన్ నాయకులు చెంచయ్య, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, భాగ్యలక్ష్మి, భరత్, నరేష్ దస్తగిరి పేటవాసులు మార్తమ్మ, సుబ్బమ్మ, శివ, సుబ్బరాయుడు, సాంబ, దర్బార్, వలి పాల్గొన్నారు.



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, దస్తగిరి పేట వాసులు

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున తెలిపారు. సోమవారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నగర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు పేదల స్థలాలు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని తెలిపారు. చిన్నపాటి వర్షం పడినా కడప నగరం దేవుని గడప చెరువును తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయడంలో కార్పొరేషన్ పూర్తిగా విఫలం చెందిందన్నారు. కార్యక్రమంలో బీసీ మహాసభ జిల్లా అధ్యక్షులు బీసీ రమణ, ఉపాధ్యక్షులు పెంచలయ్య, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ కమలాపురం అధ్యక్షులు ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నవంబరు 3 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రకటించింది. ఈ మేరకు కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, నగర గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా, అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారకరామారావు తదితరులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా విధుల్లో ఉండి మరణించి, పదవీ విరమణ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, 12వ పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై ఒత్తిడి తీసుకొస్తున్న కమిషనర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. డైలీ వేస్ కార్మికులను అవుట్ సోర్సింగ్ లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి వెంకటాద్రి, నాయకులు చంద్ర, జనార్ధన పాల్గొన్నారు.



కమిషనర్ మనోజ్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్: సమష్టి కృషితో సైన్సు ఫోరం బలోపేతానికి కృషి చేయాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్సుఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్వర్‌రెడ్డిని సోమవారం ఏపీ ఫిజికల్ సైన్సు టీచర్స్ ఫోరం కడప జిల్లా శాఖ తరుపున కడప సైన్సు మ్యూజియంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి, జిల్లా సైన్సు అధికారి వేపరాల ఎబినేజర్, సైన్సు మ్యూజియం క్యూరేటర్ రెహమాన్, ఫిజికల్ సైన్సు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సాదిక్, మాజీ జిల్లా సైన్సు అధికారి నిత్యానందరెడ్డి, వేంపల్లి ఎంఈఓ వెంకటరామిరెడ్డి, సివిరామన్ సైన్సు క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై వేధింపులు అరికట్టాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు, అంగన్వాడీలు

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ అనుబంధ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కేసీ బాదుల్లా మాట్లాడుతూ అంగన్వాడీలకు అధికారుల ద్వారా మెమోలు ఇప్పిస్తూ రాజీనామాలు చేయాలని వేధించడం దారుణమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు పెంచడంలో ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నేతలు మాట తప్పారని, కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. అర్హులైన హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యకర్తలపై పనిభారం తగ్గించేందుకు అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టీఏ, డీఏ బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చెన్నమ్మ, నాయకులు విజయ, సుజాతమ్మ, యశోద, నాగలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కార్మిక, వాణిజ్య పన్నులశాఖలు సంయుక్తంగా సోమవారం జీఎస్టీ 2.ఓ, సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించాయి. భవన నిర్మాణ కార్మిక సంఘాలు, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్లు, గిగ్ వర్కర్స్‌తోపాటు ఇతర రంగాలకుచెందిన కార్మికులతో నగరంలోని నెహ్రూ పార్కు నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దగల అంబేడ్కర్ సర్కిల్ వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు సూపర్ జీఎస్టీతో కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పద్మావతి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నారాయణరెడ్డి, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ డీవీ రంగరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్, అల్లాబకష్, శైలజ, పాల్ జాన్సన్‌తోపాటు ఇతర సిబ్బంది భవన నిర్మాణ కార్మిక సంఘ నేతలు వెంకట్య, మల్లారెడ్డి, డేనియల్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరం 48వ డివిజన్‌లోని రామరాజుపల్లెలో మూడు సిమెంటు రోడ్డు పనులను ఆ డివిజన్ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయర్ సురేష్ బాబు కృషి వల్ల రూ.14కోట్లతో ఈ పనులు మంజూరయ్యాయన్నారు. సోమవారం ఎర్త్ వర్క్ పనులు ప్రారంభించి, ఎల్లుండి కాంక్రీట్ వర్క్ పనులు మొదలు పెడతామన్నారు. మూడు రోడ్లు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ రోడ్లు సిమెంటు రోడ్లుగా తయారవుతుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

సీజేఐపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘ నాయకులు ఈశ్వరయ్య, ఎం.వెంకటేశ్, కేఎస్ రాజు, పి.బాబు తదితరులు మాట్లాడుతూ దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర్య దర్యాప్తు చేయించాలని కోరారు. సుప్రీం కోర్టులో ప్రజాస్వామ్య వాదులుగా గుర్తింపు పొందిన సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలన్నారు.

పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



రిమ్స్ మైక్రో బయాలజీ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జమున

కడప అర్బన్: తెలుగు రాష్ట్రాల తెలంగాణ –ఆంధ్రప్రదేశ్‌ల రాష్ట్రస్థాయి 28వ మైక్రో బయాలజీ విజ్ఞాన సదస్సు–2025 ఈనెల 10, 11 తేదీలలో హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) మైక్రో బయాలజీ పీజీ విద్యార్థులు ద్వితీయ సంవత్సరానికి చెందిన డాక్టర్ దావూద్ సుహేల్ పెడగాగి విభాగంలో ద్వితీయ స్థానం, మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మైథిలి జనరల్ క్రిటికల్ థింకింగ్ లో తృతీయ స్థానం సాధించారు. వీరిని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి జమున, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, మైక్రోబయాలజీ హెచ్ఓడీ డాక్టర్ బి నాగశ్రీలత సమక్షంలో ప్రత్యేకంగా అభినందించారు.